క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యాన ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందిన ఏఈలు శనివారం ఓ ప్రకటలో తెలిపారు. రూరల్ మండలంలోని గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, మద్దులపల్లి, తెల్దారుపల్లి, పొన్నేకల్, తల్లంపాడుల పరిధిలోని 11కేవీ ఫీడర్లలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏదులాపురం సెక్షన్ ఏఈ క్రాంతిసింహ, తిరుమలాయపాలెం 33కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అలరించిన 'పాటకు పట్టాభిషేకం'

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నగర ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా శనివారం సాహిత్య సంస్థ ఆధ్వర్యాన పాటకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఏర్పాటుచేయగా నగరవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆతర్వాత జేవీవీ బాధ్యులు కే.ఎల్ కాంతారావు రచించిన అమ్మ ఒడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇక ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగియనుండగా పుస్తకాల కొనుగోలుకు పాఠకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, బాల సాహితీ వేత్త సయ్యద్ షఫీ, గాయకులు రౌతు రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంచాలి

ఖమ్మంరూరల్: బీసీ రుణాల దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీన గడువు ముగుస్తుండడంతో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా సాంకేతిక లోపాలతో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో బీసీలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ధ్రువపత్రాలు అందడంలేదన్నారు. వారితో పాటు విద్యార్థులు కూడా వివిధ రకాల పత్రాల కోసం వస్తుండడంతో పనికాక ఇబ్బంది పడాల్సి వస్తోందని చెప్పారు.

అయ్యప్ప ఆలయంలో మహా కుంభాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీనివాసనగర్ శ్రీ శాస్తా దేవస్థానం(అయ్యప్ప ఆలయం)లో ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు అష్టబంధ మహా కుంభాభిషేకం, 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల వివరాలను దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ చిల్లంచర్ల రాధాక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి రాయపూడి వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి రంగారావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే అష్టబంధ మహాకుంభాభిషేకానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆలయ తంత్రి టీ.కే.దామోదరన్, ప్రధాన పూజారి పాకతిల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో కుంభాభిషేకం, బ్రహ్మోత్సవాలతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	ఆదిపురుష్
సాయిరాం	ది ఫ్లాష్
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	ఆదిపురుష్
సుందర్	విమానం

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	42	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	90		10
కాకర	50	చుక్కకూర	2
సొరకాయ	20		10
బీర	46	తోటకూర	2
దొండ	30		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	18	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

ఆటపాటల్లో దుమ్ములేపారు..


తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులు

- ప్రజల్లో చైతన్యం నింపేందుకు వందలాది ప్రదర్శనలు
- ఉద్యమం వైపు నడిపిందుకు తీవ్ర కృషి
- అవార్డులతో పాటు నటులుగా రాణిస్తున్న వైనం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎందరో ప్రాణ త్యాగం చేస్తే.. మరికొందరు ఉద్యమాలు చేపట్టి చెరసాల జీవితాలు గడిపారు. అందులో భాగంగా పాలేరు నియోజకవర్గానికి ఉద్యమాల ఖిల్లాగా పేరుంది. కాగా, తెలంగాణ సాయుధ పోరాటలకు వేదికగా నిలిచిన ఈ గడ్డలో.. కొందరు కళాకారులు గజ్జెకట్టి, ఆటపాటలతో ప్రజలను చైతన్యపరచాలని విశేషంగా కృషి చేశారు. అరువార్డులతో పాటు నటులుగా కూడా రాణిస్తున్నారు. ఉద్యమదశలో కళాకారులు పాత్రను తెలుసుకుందాం.



కలెక్టర్ గౌతమ్‌తో సన్మానం పొందిన కవి వీరబాబు(ఫైల్) (ఎడమవైపు నుంచి రెండో వ్యక్తి)



గజ్జెకట్టి.. ఆడిపాడి.. ఎర్రబస్సు కూడా ఎరుగని బైరవునిపల్లి గ్రామానికి చెందిన పెద్దపాక విజయ్‌కుమార్ ఇదిగో ఇలా తన గానంతో పల్లెలను ఉద్యమాల వైపు నడిపించేవాడు. జానపద కళాకారుడుగా వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. పల్లెసుద్దుల్లో తనదైన శైలీలో పాత్ర పోషించారు. పాలేరు డివిజన్ వ్యాప్తంగా ధూం..ధాం.. కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంగా కృషి చేశాడు. ఫలితంగా నేడు తెలంగాణ సింగర్‌గా గుర్తింపు పొందారు.

జాతీయస్థాయిలో అవార్డులు..

మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, రచయిత, నటుడు, గాయకుడు, ప్రముఖ కవి చిలకబత్తిని వీరబాబు అనే కళాకారుడు తెలంగాణ ఉద్యమంలో చూపిన కళాప్రదర్శనలతో మంచి గుర్తింపు పొందాడు. ముగ్గురు, నలుగురు చోటుకి వెళ్లి తెలంగాణ సాహిత్యం, పాటలను వినిపించి తన నటనతో ప్రజల్లో చైతన్యం నింపి నేడు జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. ప్రేముంటే చాలు, ఇట్లు అమ్మాయి.. ఒక అబ్బాయి అనే సినిమాలో నటుడిగా, శ్రీలక్ష్మి తిరపతమ్మ తల్లి సీరియల్‌లో నటించారు.

నేలకొండపల్లి: తెలంగాణ ఉద్యమంలో పాలేరు నియోజకవర్గానికి కీలక పాత్ర. ఉద్యమం మొదటి నుంచే అనేక మంది చురుగ్గా పాల్గొన్నారు. కళాకారులకు పుట్టినిల్లుగా నిలిచిన పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి మండలంలోని మారుమూల గ్రామాలకు చెందిన కళాకారులు ప్రజలను ఉద్యమం వైపు నడిపించేందుకు తీవ్ర కృషి చేశారు. కాళ్లకు గజ్జెలు కట్టి, గొంగడి పట్టుకుని, ఆటపాటలతో పల్లెల్లో ప్రజలను చైతన్యవంతులుగా చేసేవారు. తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన కళాకారులకు నిలయంగా నేలకొండపల్లితో పాటు తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని కళాకారులు నిలిచారు.

సండే స్పెషల్

జానపదాలు ఊపిరిపోశాయి..



తెలంగాణ ఉద్యమంలో జానపద కళాకారులు చేసిన ప్రదర్శనలు ఉద్యమానికి ఊపిరిపోశాయి. ముఖ్యంగా పాటలు ప్రజలను కదిలించాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణలో కళాకారుల పాత్ర కీలకం. వీరిని గుర్తించడం చాలా సంతోషంగా ఉంది.

– తేజావత్ భిక్షం, జానపద కళాకారుడు, మంగాపురంతండా

ఊరూరా గజ్జెకట్టి ఆడా..

తెలంగాణ ఉద్యమంలో ఊరూరా గజ్జెకట్టి ఆడిపాడి ప్రజలను చైతన్యం చేశాం. రాష్ట్ర అవతరణలో ఏ స్వార్థం లేకుండా కళాకారుడిగా పని చేశాను. రాష్ట్రం ఏర్పడినందుకు ఉద్యమంలో చేసిన కష్టం మరిచిపోయాం. పాటలతో ప్రజలను కలవడం మరిచిపోలేను.

– పెద్దపాక విజయ్‌కుమార్, సింగర్, బైరవునిపల్లి

ఉద్యమంతోనే కవిగా గుర్తింపు..

తెలంగాణ ఉద్యమంలో చేసిన ప్రదర్శనలు, కవితలు, పాటలు కవిగా గుర్తింపు తెచ్చాయి. నేడు జాతీయస్థాయిలో అనేక అవార్డులు అందుకున్నాను. ఇటీవల తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది.

– చిలకబత్తిని వీరబాబు, కవి, అనాసాగారం

రామారావు స్ఫూర్తితో పోరాడాలి

రఘునాథపాలెం: ప్రజా సమస్యలపై తుదిశ్వాస వరకు పోరాడిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు అడెపు రామారావు స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర పాలకుల నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటం చేయాలని ఏఐపీకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య పేర్కొన్నారు. మండలంలోని చింతగుర్తిలో ఆడెపు రామారావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, గిట్టుబాటు ధరలు, తదితర సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకురాలు బచ్చలకూర ఝాన్సీ, ఆవుల మంగతాయి, మండల కార్యదర్శి కేశోతు లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, నాయకులు మేక రామనాథం, పోరాకుల నరసయ్య, పొట్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

'నారాయణ ఒలంపియాడ్'కు అన్ని అనుమతులు

ఖమ్మం సహకారనగర్: నారాయణ ఒలంపియాడ్ స్కూల్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని ఏజీఎం వేణుగోపాల్ తెలిపారు. జిల్లా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యంగా ఒకటి నుంచి 5వ తరగతి వరకు సాంకేతిక విధానంలో బోధన, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్‌లలో శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నందున తల్లిదండ్రులు అపోహలకు గురికావొద్దని కోరారు. కాగా, 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు ఏసీ తరగతుల్లో ఈ ఏడాది ఒలంపియాడ్ ప్రోగ్రాం ప్రారంభించామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ హయాంలోనే తండాలకు మహర్దశ

గిరిజన దినోత్సవ వేడుకల్లో మంత్రి అజయ్‌కుమార్



కేవీ బంజరలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

రఘునాథపాలెం: గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.. తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గిరిజన దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని లచ్చిరాంతండా, దొనబండ, మంగ్యతండా, కేవీ బంజర, మూలగూడెం, ఎన్‌వీ బంజర, రజబ్‌అలీనగర్ గ్రామాల్లో పంచాయతీ నూతన భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు చొప్పున మొత్తం రూ.1.40 కోట్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. తొలుత ఆయా గ్రామాల్లో గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో మంత్రికి ఘన స్వాగతం పలుకగా.. రజబ్ అలీనగర్‌లో గ్రామ సర్పంచ్ శ్రీను అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా మార్చడంతో గిరిజనులే సర్పంచులు, వార్డు సభ్యులుగా పాలించుకుంటున్నారని, ఒకప్పుడు బుడుగు రోడ్లు నేడు సీసీరోడ్లతో అద్దంలా మెరుస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో బంజారాల ఆత్మగౌరవార్థం ప్రభుత్వం బంజారా భవన్ నిర్మిస్తుందని, 100 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అమలవుతోందని, ఆరు శాతం రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచిన ఫలితంగా విద్యా, ఉద్యోగావకాశాలు మెరుగుపడ్డాయని వెల్లడించారు. ఈ సందర్భంగా గిరి వికాస్ పథకం ద్వారా రైతులకు వంద శాతం సబ్సిడీతో ఆరుగురు లబ్ధిదారులకు మోటార్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, పీఆర్ ఈఈ కేవీకే శ్రీనివాస్, రఘునాథపాలెం ఎంపీపీ భూక్యా గౌరి, జెడ్పీటీసీ ప్రియాంక, వైస్ ఎంపీపీ గుత్తా రవి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మూలగూడెం హెచ్‌ఎంకు సన్మానం..

మండలంలోని మూలగూడెం పాఠశాల హెచ్‌ఎం సతీష్‌ను శనివారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సన్మానించారు. మూలగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే ముచ్చటించాక పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. గ్రామస్తులు,విద్యార్థుల అభిప్రాయం మేరకు పాఠశాల అభివృద్ధిలో హెచ్‌ఎం పనితీరును మెచ్చుకుని అక్కడే సన్మానించారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు మంత్రి అభినందన..

ఖమ్మంమయూరిసెంటర్: రైతులకు విద్యుత్ భద్రత, విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడంలో విశేష కృషి చేస్తున్నందుకు ఎస్‌బీఐటీ విద్యార్థులను మంత్రి అజయ్‌కుమార్ శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మార్గ దర్శకత్వంలో విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజ్‌కుమార్, ఎలక్ట్రికల్ విభాగ అధిపతి డాక్టర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ బ్రోచర్లను చూపిస్తున్న మంత్రి

22వ డివిజన్‌లో ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 22వ డివిజన్‌లో శనివారం డివిజన్ కార్పొరేటర్ పల్లా రోజ్‌లీనా, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలనతో పాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ షేక్ సిద్దా సాహెబ్, బీఎల్‌ఓ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణలో భాగస్వాములు కండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో తోపుడు బండ్లపై వ్యాపారాలు నిర్వహించే వీధి వ్యాపారులు ఆహార పదార్థాలు తయారీలో కనీస నిబంధనలు పాటించి నాణ్యమైన ఆహారం అందించాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శనివారం కేఎంసీ కార్యాలయంలో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అలాగే కేఎంసీలో ప్లాస్టిక్‌ను నిషేధించినందున వ్యాపారులు తమ వ్యాపారంలో ప్లాస్టిక్ బదులుగా అరటి ఆకులు, స్టీల్ వస్తువులను వినియోగించాలని సూచించారు. అదేవిధంగా జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ స్ట్రీట్ ఫుడ్ వెండర్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నెస్లి, నాస్వి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన శిక్షణలో పాల్గొన్న వీధి వ్యాపారులకు రూ.2 వేల విలువైన మెటీరియల్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి, డిప్యూటీ మేయర్ పాతిమ జోహర, డీఎంసీ సుజాత, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, నెస్లి మెనేజర్ వసిం అహ్మద్, నాస్వి సీనియర్ హెడ్ డి.లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న మేయర్,తదితరులు


శతాధిక వృద్ధురాలి మృతి



సాయమ్మ(ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన శతాధిక వృద్ధురాలు భూక్యా సాయమ్మ (101) శనివారం వయోభారంతో మృతి చెందారు. ఈమె చెరువుమాధారం ఉమ్మడి పంచాయతీగా ఉన్నప్పుడు, మంగాపురంతండా పంచాయతీగా ఏర్పడినప్పుడు వార్డు సభ్యురాలిగా పని చేశారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'హార్వెస్ట్' రవిమారుత్‌కు పలువురి పరామర్శ



సుబ్బమ్మ (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ తల్లి సుబ్బమ్మ వయోభారంతో శనివారం మృతి చెందారు. ఖమ్మంలోని స్వగృహంలో ఆమె మృతి చెందారని హార్వెస్ట్ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆమెకు నలుగురు సంతానం కాగా, కుమారుడు రవిమారుత్ హార్వెస్ట్ కరస్పాండెంట్‌గా, ఆయన సతీమణి గైనకాలజిస్ట్‌గా పి.ఆనందవాణిగా కొనసాగుతున్నారు. కాగా, సుబ్బమ్మ మృతదేహం వద్ద వివిధ పార్టీల నాయకులు, విద్యాసంస్థల ప్రతినిధులు నివాళులర్పించి రవిమారుత్, కుటుంబీకులను పరామర్శించారని హార్వెస్ట్ ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు.

సర్పంచ్‌కు నివాళి

కూసుమంచి: మండలంలోని రాజుపేట బజారు గ్రామ పంచాయతీ సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. శనివారం ఆయన దశదిన ఖర్మను నిర్వహించారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి హాజరై వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. వారి వెంట ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సొసైటీ చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మోదుగు వీరభద్రంతో పాటు పలువురు సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ వెండి బంగారం శాఖ ఆధ్వర్యాన ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని శనివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణలతో పాటు బంధు సూర్యం, నకిరకంటి సతీష్, గద్దం శ్రీనివాస్ రావు, మిట్టపల్లి వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

21న ఆధ్యాత్మిక దినోత్సవం

నేలకొండపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యాన ఈ నెల 21న జరిగే ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి దేవాదాయ శాఖ ఈఓ పి.నారాయణచార్యులు కోరారు. శనివారం స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయ అర్చకులు తూపురాణి మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

రేపటి కల్లా ధ్రువపత్రాలు ఇవ్వాలి



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కందాల

కూసుమంచి: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష రుణాలు ఇస్తున్నందున వారికి కావాల్సిన కుల, ఆధాయ ధ్రువపత్రాలను వెంటనే అందజేయాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడగా.. ఆధాయ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం జరుగుతోందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వచ్చిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న వాటిని ఆదివారం సెలవు అయినప్పటికీ కార్యాలయానికి వచ్చి సోమవారంలోగా దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని తహసీల్దార్ మీనన్‌ను ఆదేశించారు. లంచం అడిగినట్లు తేలితే సహించేది లేదని, ప్రజలను ఎవరూ ఇబ్బంది పెట్టొద్దని పేర్కొన్నారు. కాగా, శుక్రవారం కార్యాలయంలో సిబ్బంది మధ్య జరిగిన ఘర్షణ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తేగా.. మరోమారు ఇటువంటి సంఘటనలు పునరావృతం కావద్దని హెచ్చరించారు.

నూతన పంచాయతీ భవనాలకు శంకుస్థాపన

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్మించనున్న నూతన పంచాయతీ భవనాలకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. రూరల్ మండలం ఆరేకోడుతండా, నేలకొండపల్లి మండలం తిరుమలాపురం పంచాయతీలలో రూ.20 లక్షల చొప్పున నిర్మించనున్న నూతన పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అలాగే రూరల్ మండలం ఆరేకోడుతండాలో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు సర్పంచ్ తెలిపారు. అలాగే ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇస్తామని, ఇళ్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే డబుల్ బెడ్‌రూం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీలు వజ్జా రమ్య, బెల్లం ఉమ, ఎంపీడీఓలు కె.జమలారెడ్డి, అశోక్, సర్పంచ్‌లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, తిరుమలాపురం గ్రామంలో గిరిజన రైతులకు సంబంధించిన దారి పంచాయతీ వలన పొలాలు బీడుగా మారాయని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేసేందుకు గిరిజనులు సిద్ధమవడంతో పోలీసులు ముందస్తుగా అడ్డుకుని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ఎమ్మెల్యేకు వివరించారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

తిరుమలాయపాలెం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన ఉత్సవాలు నిర్వహించగా.. గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ఎంపీపీ బోడ మంగీలాల్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన అధికారులైన ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, వైద్యాధికారి వసుంధరలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య, ఏఈలు శ్రీకాంత్, రామకృష్ణ, ఎంపీటీసీ అంబేద్కర్, కోఆప్షన్ సభ్యుడు సైఫుద్దీన్, కేపీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

అంబేద్కర్ భవనాన్ని పునర్ నిర్మించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: శిథిలావస్థలో ఉన్న అంబేడ్కర్ భవనాన్ని పునర్ నిర్మించాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి జాకోబ్ ప్రతాప్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 25 ఏళ్ల క్రితం పేద, మధ్య తరగతి వర్గాల ఫంక్షన్ల సౌలభ్యం కోసం నిర్మించిన ఈ భవనం పెచ్చులూడిపోయి భయానకంగా మారిందని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదు

ఖమ్మంక్రైం: సోషల్ మీడియా వేదికగా తనపై కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ అగౌరవపరుస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్‌లు చేయడమే కాక వ్యక్తిగత నంబర్లకు ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

అటెన్షన్ ప్లీజ్

కుప్పలుగా చెప్పులు..!

ఇక్కడ పడేసిన వందలాది చెప్పులు అవసరం తీరిన తర్వాత పడవేసినవి కావండి.. ఖమ్మం జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చిపోయే బాధితులు, వారి సహాయకులు విడిచిపెట్టి పోయినవి. ఆస్పత్రికి నిత్యం గర్భిణులు, బాలింతలతో పాటు చాలా మంది ఆస్పత్రికి వచ్చిపోతుంటారు. దీనిలో భాగంగా ఆస్పత్రి లోపలకు చెప్పులతో వెళ్లేందుకు అనుమతి లేకపోవడంతో ఇలా బయట విడిచి వెళ్తుంటారు. చెప్పులన్నీ కలిసిపోవడం, ఒకరి చెప్పులు మరొకరు వేసుకొని వెళ్లడం మూలంగా చాలా మందికి వారి చెప్పులు దొరక్క అక్కడే వదిలేసి వెళ్తున్నారు. దీంతో ఆ చెప్పులను పారిశుద్ధ్య సిబ్బంది వాటిని ఆస్పత్రి వెనుక ప్రాంతంలో పడేస్తుండడంతో ఇలా గుట్టలుగా దర్శనమిస్తున్నాయి.



- ఖమ్మం వైద్యవిభాగం